క్లుప్తంగా

చురుగ్గా ఏబీ రోడ్డు నిర్మాణ పనులు


సింగిడి వద్ద జోరుగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

భామిని: మండల పరిధిలో ఏబీరోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించింది. సుమారు రూ.3.42 కోట్లతో లివిరి నుంచి బిల్లుమడ వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పసుకుడి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం పసుకుడి–బిల్లుమడ, సింగిడి–నులకజోడు మధ్య రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


ఆస్పత్రికి వెళ్లి అప్పలనరసమ్మకు పింఛను అందిస్తున్న వలంటీరు రమేష్

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం సచివాయ పరిధిలో పింఛన్ లబ్ధిదారు ముదిలి అప్పలనరసమ్మ గత కొద్ది రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. విజయనగరంలో ఉన్న ప్రేమసమాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ప్రస్తుత సమయంలో పింఛను ఆవసరం ఎంతో ఉందని గుర్తించిన వలంటీరు శిర్లాపు రమేష్ వియనగరం వెళ్లి పింఛన్ డబ్బులు రూ.3వేలు అందించారు. కష్ట సమయంలో పింఛన్ డబ్బులు తన వద్దకు పంపించినందుకు సీఎం జగన్‌కు అప్పలనరసమ్మ, వారి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రికి గీజర్ల వితరణ


ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు గీజర్లు అందిస్తున్న పాలవలస మణికంఠ

పాలకొండ రూరల్: ప్రజాసేవ చేసేందుకు తాము ఎల్లప్పుడూ ముందువరుసలో ఉంటామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కుమారుడు మణికంఠ అన్నారు. తన ముత్తాత, మాజీ ఎమ్మెల్యే దివంగత సంఘంనాయుడు జ్ఞాపకార్థం రెండు గీజర్లను స్థానిక ఏరియా ఆస్పత్రికి వితరణగా అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావుకు సోమవారం వాటిని అందజేశారు. మాతాశిశు విభాగంలో వైద్యసేవలు పొందుతున్న వారికి ఈ యంత్రాల ద్వారా వేడి నీరు అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్త

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి కోమటిపేట అంగన్‌వాడీ కార్యకర్త నూతలపాటి జయభూషణ సోమవారం విధుల్లో చేరారు. ఈమేరకు లిఖిత పూర్వకంగా ఐసీడీఎస్ పీఓ శిమ్మాలమ్మకు వినిపత్రం అందించారు. తాను తీవ్ర అనారోగ్యం బాధపడుతున్న సమయంలో జగనన్న ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించి ప్రాణాలు కాపాడారని, తన కుమార్తెకు సచివాలయంలో ఉద్యోగం వచ్చిందని, తనకు తన కుటుంబానికి ఎంతో మేలు జరిగిందని గుర్తుచేసుకున్నారు. సమ్మెలో జగనన్ను వ్యక్తిగతంగా దూషించటాన్ని సహించలేక సమ్మె విరమించుకున్నట్లు చెప్పారు.

శ్రీరాముని అక్షతల ఊరేగింపు


భామిని: బత్తిలిలో శ్రీరాముని అక్షతల ఊరేగింపు

భామిని: మండలంలోని బత్తిలిలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని అక్షతలను సోమవారం ఊరేగించారు. సమరసత సేవా సంఘం, రామభక్త సంఘాల ఆధ్వర్యంలో అక్షతలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. యువకులు కాషాయ జెండాలు పట్టుకొని, మహిళలు కళశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. శ్రీరామ నామస్మరణతో గ్రామం మార్మోగిపోయింది.

గుమ్మలక్ష్మీపురం: అయోధ్య నుంచి తీసుకొచ్చిన బలరాముని అక్షతల పంపిణీ కార్యక్రమం సోమవారం గుమ్మలక్ష్మీపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బి.గౌరీశంకరరావు, స్థానిక రామాలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఇంటింటికీ వెళ్లి అక్షతలను అందజేశారు. జై శ్రీరాం నినాదాలతో గ్రామం మార్మోగింది.

గ్రామ సచివాలయాలు

ప్రజాసేవా కేంద్రాలు

మండలం:	సీతంపేట
పంచాయతీలు:	53
గ్రామ సచివాలయాలు:	31
నిర్మాణాలు పూర్తయినవి:	16
ఒక్కో సచివాలయానికి ఖర్చు:	రూ.48 లక్షలు

- గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పాలన
- ఒకే చోట 500లకు పైగా ప్రభుత్వ సేవలు
- కష్టాలు తీరాయంటున్న గిరిశిఖర గ్రామస్తులు



సీతంపేట గ్రామ సచివాలయం

సీతంపేట: ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 2వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటు చేశారు. ప్రతీ సచివాలయంలో పది మంది చొప్పున సిబ్బందిని నియమించి వారి ద్వారా సుమారు ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయిలోనే ప్రజలకు అందజేస్తున్నారు. గతంలో రేషన్‌కార్డు మొదలు కొని ఏ ధ్రువపత్రం కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల సాయంతో గ్రామంలోని అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలు ఇస్తుండటంతో దేశంలోని ఇతర రాష్ట్రాలు దీన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయి.

సీతంపేట మండలంలో 53 గ్రామ పంచాయతీలకు గాను 31 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. సొంత భవనాల నిర్మాణం కోసం ఒక్కో సచివాలయానికి రూ.48 లక్షలు చొప్పున ప్రభుత్వ కేటాయించింది. ప్రస్తుతం 16 భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన భవనాల నిర్మాణాలు త్వరలోనే పూర్తి కానున్నాయి. ప్రతీ సచివాలయంలో 520 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, 1బీ, పట్టాదారు పాస్‌బుక్, అడంగల్, ఆధార్‌కార్డు, కౌలురైతు గుర్తింపు కార్డు, తదితర సేవలన్నీ ఉన్న ఊర్లోనే అందుతున్నాయి.


అధునాతన వసతులతో నిర్మించిన పెద్దూరు గ్రామసచివాలయం

జగనన్నకు రుణపడి ఉంటాం



గిరిజన ప్రాంత వాసులం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఎన్నో ఏళ్లుగా పడుతున్న కష్టాలకు చెక్‌పెట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ నేరుగా పథకాలన్ని సచివాలయాల ద్వారా అందుతున్నాయి. అలాగే 'గడపగడపకు మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి, పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున కేటాయించారు. గిరిజనుల కష్టాలను చూసి మైదానప్రాంతాల కంటే రూ.20 లక్షలు అధికంగా కేటాయించడం హర్షణీయం.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

సకాలంలో అన్ని సేవలు



గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సకాలంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నాం. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. – పాపారావు, గ్రామకార్యదర్శి, కుడ్డపల్లి

ఒకటో తేదీనే పింఛన్



ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే వలంటీరు వచ్చి పింఛన్ డబ్బులు తెచ్చి ఇస్తున్నారు. గతంలో పింఛన్, రేషన్ కోసం మండల కేంద్రానికి వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ ధ్రువపత్రం కావాలన్నా సచివాలయంలోనే ఇస్తున్నారు. ప్రభుత్వ పథకాల డబ్బులు మా బ్యాంకు ఖాతాలోనే నేరుగా పడుతున్నాయి.

– సవర చిన్నమంగయ్య, కేపీ ఈతమానుగూడ



హడ్డుబంగి రైతు భరోసా కేంద్రం


పాలకొండ రూరల్: ఓని ప్రభుత్వ పాఠశాలలో దూడూ బసవన్న వేషధారణలో విద్యార్థులు


పాలకొండ రూరల్: తమ్మినాయుడు విద్యా సంస్థల్లో సంక్రాతి వేడుకలు


వీరఘట్టం: దశమంతుపురం పాఠశాలలో భోగిమంట వెలగిస్తున్న ఉపాధ్యాయులు

● సంక్రాంతి సంబరం


పాలకొండ రూరల్: భోగి మంటల వద్ద కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

పాలకొండ రూరల్/వీరఘట్టం: సాంప్రదాయాల మేళవింపు సంక్రాంతి. తెలుగువారంతా ఎంతో ఘనంగా జరుపుకునే ఈ పండగ విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాలకొండ మండలం ఓని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం బలగ నాగమణి ఆధ్వర్యంలో, తమ్మినాయుడు విద్యాసంస్థలో, వీరఘట్టం మండలం దశమంతుపురం పాఠశాలలో హెచ్‌ఎం ఊడ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు హరిదాసు, దూడూ బసవన్న వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణంలో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి చుట్టూ కోలాటం ఆడుతూ సందడి చేశారు.

దార్శనికుడు అంబేడ్కర్


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: బడుగుల ఆశాల జ్యోతి.. దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బుక్కూరు సర్పంచ్ టి.సుందరమ్మ అన్నారు. ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటున్నట్లు చెప్పారు. బలహీన వర్గాలకు సమాజంలో గుర్తింపు తెచ్చింది అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను సీఎం జగన్‌మోహనరెడ్డి అమలు చేస్తున్న తీరు హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిన్నింటి లక్ష్మి, ఉప సర్పంచ్ వి.కొండలరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం


కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు

పాలకొండ రూరల్: జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తారని వాటపాగు, అట్టలి గ్రామాల సర్పంచులు వి.రాజారావు, కనుముల సంధ్యారాణి అన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు అందించారు. ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పింఛన్ అందించిన ఘనత జగనన్నదే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, జన్మభూమి కమిటీల పేరుతో ఇబ్బందులకు గురిచేసేవారని గుర్తుచేశారు. రానున్న ఎనిక్నల్లో మళ్లీ జగనన్న నాయకత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.దామోదరరావు, సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అర్హతే కొలమానంగా పథకాల అమలు

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గరుగుబిల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు పింఛన్‌ను రూ.3 వేలు చేశారన్నారు. 2019కి ముందు 39 లక్షల మందికి పింఛన్లు అందేవని, జగనన్న సీఎం అయ్యాక కొత్తగా మరో 29 లక్షల మందికి పింఛన్లు అందించారన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా లంచాలు లేవు. జన్మభూమి కమిటీలు లేవు. రాజకీయ కక్షసాధింపులు లేవు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల ఆత్మాభిమానం రెంట్టింపయ్యిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంపీడీఓ జి.పైడితల్లి, సర్పంచ్‌లు కె.ఇందుమతి, కె.శిరీష, బి.మహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది. వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు. అలాగే అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

గిరిజన స్పందనకు 39 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 39 వినతులు వచ్చాయి. కడుమసింగికి చెందిన సవర ఉషారాణి తాను చదువుకునేందుకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని పీఓను కోరారు. వీడీవీకే నిర్వాహణకు స్థలం కేటాయించాలని దాకులపాగు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రహదారి పనులు పూర్తి చేయాలని నేలబొంతుకు చెందిన ఆరుద్ర, సీసీ రోడ్డు నిర్మించాలని జేపీగూడ గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలని కొత్తగూడకు చెందిన ఎలికాన్, ఇంటిస్థలం మంజూరు చేయాలని కోరుతూ ఇప్పమానుగూడకు చెందిన పార్వతి అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, తదితరులు పాల్గొన్నారు.


క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం


సీతంపేట: వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

పాలకొండ రూరల్: క్రీడలతో గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గోపాలపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వారాడ దుర్గారావుతో కలిసి ఔత్సాహిక క్రీడాకారులకు ప్రభుత్వం సమకూర్చిన క్రీడా దుస్తులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చంద్రశేఖర్, సవిరిగాన చిన్నికృష్ణ, మాచర్ల రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

సీతంపేట: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయికి ఎంపికైన సోమగండి వాలీబాల్ జట్టుకు ఎంపీపీ బి.ఆదినారాయణ సోమవారం వాలీబాల్ కిట్లు, టీ షర్టులు, టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెప్టెన్ గంటా సోమేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు సుదర్శనరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న వైస్ ఎంపీపీ అనీల్‌కుమార్

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భోగి లత


భోగి లతకు ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా

వీరఘట్టం:

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న వీరఘట్టంకు చెందిన భోగి లత పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీని విజయవాడ కార్యాలయంలో భోగి లతకు సోమవారం అందజేశారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు మరోసారి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: పట్టణంలోని కస్పావీధి సమీపంలో లుంబూరు వెళ్లే రహదారిలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. నగర పంచాయతీకు చెందిన ముద్దాడ శ్రీరాములు, పేకేటి లచ్చయ్య పశుగ్రాసం కోసం సిద్ధం చేసుకున్న గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి జామి సర్వేస్వరరావు, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


కురుపాం: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ప్రైవేటు విద్యకు దీటుగా నాణ్యమైన విద్యను అందించటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎంఈఓ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 8వ తగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. పేదరికం చదువుకు అడ్డుకారాదనే ఉద్దేశంతో పిల్లలను బడికి పంపించిన తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి పథకం, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర పథకాల ద్వారా నిధులు జమ చేస్తోందన్నారు. జగనన్న విద్యాకానుక కింద ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు స్కూల్ బ్యాగు, యూనిఫాం, నోట్‌బుక్స్, బూట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఇంగ్లిష్ మీడియం బోధనతో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు నిషార్, జిలానీ, కళింగ వైశ్య, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కొత్తకోట సురేష్, గవర విజయ్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి నిమ్మల వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.